విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

రూ. 5.92 కోట్లతో డ్రైన్లలో తూడు తొలగింపు

విశాలాంధ్ర- భీమవరం: జిల్లాలోని డ్రైన్స్ లో రూ.5.92 కోట్ల వ్యయంతో చేపట్టిన 35 తూడు తొలగింపు పనులను విమర్శలకు తావులేని విధంగా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి డ్రైనేజీ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై తూడు తొలగింపు పనులపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో అధిక వర్షాలు, వరదల కారణంగా పంట పొలాలు, నివాస ప్రాంతాలు పెద్ద ఎత్తున ముంపునకు గురయ్యాయన్నారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా నీటి పారుదల సాఫీగా సాగేలా డ్రైన్స్‌లో తూడు తొలగింపు పనులను విమర్శలకు తావులేని విధంగా,కంటికి కనిపించేంత స్పష్టంగా నిర్వహించాలన్నారు. 64 పూడికతీత పనులకు రూ. 3.02 కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు. గునుపూడి సౌత్ డ్రైన్ కారణంగా తాడేరు చుట్టుపక్కల ప్రాంతంలోని సుమారు రెండు వందల ఎకరాల మేర నీరు చేరుతుందని, పొలిమేరతిప్ప మీడియం డ్రైన్ కారణంగా బ్యాక్ వాటర్ వలన సుమారు 500 ఎకరాలలో నీరు చేరుతుందని, ఉప్పుటేరు - చిన్న కాపవరం వద్ద ఉప్పుటేరు ప్రారంభం నందు నీటి ప్రవాహానికి కిక్కిస అడ్డు తగులుతుందని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో ఈ.ఈ డ్రైయిన్స్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిఇలు జి. వినోద్ చంద్ర, కె.వరప్రసాద్, ఏఈఈలు పి.వెంకటేశ్వరరావు, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరాలి

విశాలాంధ్ర-భీమవరం: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంను అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పి.ఎం విశ్వకర్మ పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంపగుత్తగా దరఖాస్తులు వస్తే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఈ విధమైన చర్యల వలన నిజమైన లబ్ధిదారులు ప్రయోజనానికి దూరం

అవుతారన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమాజంలో వెనుకబడిన యానాది, ఎరుకల, తదితర ఎస్టి వర్గాలకు ప్రయోజనం చేకూరేలా, వారిని గుర్తించి దరఖాస్తు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో ఎంతమంది శిక్షణ పొందారు, ఎంతమందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి తదితర విషయాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి సిహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, భీమవరం డిఎల్‌డివో అప్పారావు పాల్గొన్నారు.

విధుల్లో పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : పోలీసులకు విధుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. పోలీస్ సంక్షేమ దివాస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న పోలీస్

సిబ్బంది నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో సిబ్బందికి ఎదురయ్యే ఎటువంటి సమస్యనైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది కూడా విధుల్లో అలసత్వం వహించకుండా అంకితభావంతో పనిచేసే పోలీస్ శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ప్రధాన కార్యాలయం ఏ1 సాల్మన్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరులో వందేభారత్ హాల్ట్‌కు రైల్వే ప్రిన్సిపాల్ ఈడీ హామీ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలుకు త్వరలో హాల్ట్ ఇవ్వనున్నట్లు రైల్వే శాఖ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవేంద్ర కుమార్ హామీ ఇచ్చినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ చెప్పారు. శుక్రవారం ఢిల్లీ రైల్ భవన్‌లో రైల్వే ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోచింగ్) దేవేంద్ర కుమార్ ను ఎంపీ మహేష్ కలిసి ఏలూరు రైల్వే స్టేషన్

లో వందే భారత్ రైలు హాల్ట్ (నిలుపుదల) చేయాలని మరోసారి దేవేంద్ర కుమార్ ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన దేవేంద్ర సంబంధిత అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరలో ఏలూరులో వందే భరత్ రైల్ నిలుపుదల అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ మహేష్ తెలిపారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించిన ఎన్ఎస్ఐసి అధికారులు

విశాలాంధ్ర -నూజివీడు : ఎన్ఎస్ఐసి అధికారులు శుక్రవారం ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. క్యాంపస్‌లోని వివిధ ప్రయోగశాలలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం క్యాంపస్ డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్ తో పాటు విభాగాధిపతులతో సమావేశం అయ్యారు. విద్యార్థులకు ఇచ్చే శిక్షణ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సూక్ష్మ పరిశ్రమల స్థాపన కొరకు అవసరమయ్యే విషయాలు, విద్యార్థులు ఉద్యోగాల సంపాదించడానికి ఇచ్చే శిక్షణ తదితర విషయాలు ట్రిపుల్ ఐటీ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ వివిధ శిక్షణ కార్యక్రమాల పై విభాగాధిపతులకు, విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇవ్వనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఐసి హైదరాబాద్ అధికారులు ఎన్ కె సుబ్రమణి, టి ముత్తు కుమారన్, అబ్దుల్ ఖాదర్, క్యాంపస్ డీన్ అకాడమిక్ రత్నాకర్, అసోసియేట్ డీన్ అకాడమిక్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరపాలక సంస్థ

బహిరంగ వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం.84273/2023/ఏ1 తేది: 31-7-2024

ఏలూరు నగరపాలక సంస్థలో విలీనము కాబడిన **చొదిమెళ్ళ గ్రామ పంచాయితీ** సందు గల **గవళ్ళ చెరువు AC 3.82** సెంట్లు.సదరు చెరువును మూడు (3) సంవత్సరముల కాలమునకు **01-08-2024** నుండి **31-07-2027** వరకు బహిరంగ వేలము ద్వారా లీజుకు ఇచ్చుటకు గాను **09-08-2024** తేదీన ఉదయం **11.00** గం.లకు ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణ యందు బహిరంగ వేలము నిర్వహించుటకు నోటీసు జారీ చేయడమైనది.

వ.నెం	వివరము	చెరువు పేరు	మొత్తము చెరువు	డిపాజిట్ మొత్తము	సాల్వెన్సీ
1.	చొదిమెళ్ళ గ్రామ పంచాయతి	గవళ్ళ చెరువు	1	50,000/-	రూ.9,00,000/-

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకొనగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : **9849907144.**

కమీషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు

నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు డిపో నుండి డిమాండ్ ఉన్న రూట్లలో అదనపు బస్సు సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు బస్సు డిపో లో నూజివీడు నుండి బెంగళూరుకు 2 నూతన బస్సు సర్వీసులను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ నూజివీడు నుండి హైదరాబాద్, వైజాగ్, శ్రీకాకుళం వంటి దూర ప్రాంతాలకు బస్సు సర్వీసులు కావాలని ప్రజలు కోరుతున్నారని, త్వరలో ఆయా ప్రాంతాలకు బస్సు సర్వీస్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ బస్సులతో పోటీగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూజివీడు బస్సు స్టాండ్ లో

ప్రయాణీకులకు మరిన్ని సదుపాయాలు అందిస్తామన్నారు. నూజివీడు ప్రాంతంలో మామిడి, మొక్కజొన్న, ఉద్యాన పంటల మార్కెటింగ్ సదుపాయం నిమిత్తం సుదూర ప్రాంతాలకు మార్కెటింగ్ సౌకర్యం ఉన్న ప్రాంతాలకు కూడా రవాణా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రి మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించదగిన సమస్యలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకంపై మంత్రి మాట్లాడుతూ ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఎప్పటి ప్రారంభించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం ఖచ్చితంగా అమలు చేస్తామని మంత్రి పార్థసారథి చెప్పారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన బస్సును మంత్రి పార్థసారథి స్వయంగా నడిపారు.

కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైకుపై ఎస్పీ పర్యటన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. శుక్రవారం ఏలూరు నగరంలోని పోలీస్ లైన్ లో గల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ట్రాఫిక్ సిఐను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏలూరు నగరంలో ద్విచక్ర వాహనంపై

సుడిగాలి పర్యటన చేసి వివిధ ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ సిఐకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని ఫైర్ స్టేషన్ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్ సెంటర్, ఆర్ఆర్ పేట, పవర్ పేట, ఓల్డ్ బస్టాండ్, ఆదివారపు పేట, కండ్రిగూడెం తంగేళ్ళమూడి, అల్లూరి సీతారామరాజు స్టేడియం, న్యూ బస్టాండ్, శాంతి నగర్, వన్ టౌన్, టూ టౌన్, 3 టౌన్ లో ఉన్న అన్ని ప్రాంతాలలో ఎస్పీ కిషోర్ ద్విచక్ర వాహనం నడుపుకుంటూ వెళ్లి పరిశీలించారు. ఈ పర్యటనలో ఎస్పీతో పాటు ఏలూరు మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్, వి.తాత బాబు, ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ బి.ఆది ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కారాగారాన్ని సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ శుక్రవారం స్థానిక జిల్లా కారాగారాన్ని సందర్శించారు. కారాగారంలోని ఖైదీలకు అందిస్తున్న ఆహారం, నీరు, వైద్య సౌకర్యాల పైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడుతూ ఖైదీల కుటుంబ సభ్యులకు సమస్యలు ఎదురైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని వారికి ఉచిత న్యాయ సహాయం చేస్తారని, వివిధ కేసులలో ఉన్న ముద్దాయిలకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా ఉచితంగా కేసులను వాదించనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తు న్నారని రాజీయోగ్యమైన కేసులలో ఫిర్యాదుదారులతో సంప్రదించి కేసుల పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెం డెంట్ ఆర్వి.స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆగస్టు 4న సిపిఐ నిర్వహించే జనరల్ బాడీ సమావేశంలో స్థానిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బాడిస రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.వేలేరుపాడు సిపిఐ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో స్థానిక సమస్యలు పరిష్కారం, పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తారని అన్నారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య వస్తారని తెలిపారు. మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని బాడిశ రాము విజ్ఞప్తి చేశారు.

ఎస్ఆర్‌కేఆర్‌కు ప్రశంసా పత్రం

విశాలాంధ్ర -భీమవరం: విదేశాల్లో చదువుకునే విద్యార్థుల కోసం జి ఆర్ ఈ, టోఫెల్ , ఐ ఈ ఎల్ టి ఎస్ వంటి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఈ టి ఎస్ ఇండియా సంస్థ నుంచి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందుకుంది . ఈ



సందర్భంగా కళా శాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణం రాజు శుక్రవారం కళాశాల మేనేజ్మెంట్ మీటింగ్ హాల్లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ టి ఎస్ ఇండియా ప్రతినిధి వంశీకృష్ణ నుంచి ప్రశంసా పత్రాన్ని అందు కున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Shaik Abdulla Ahmed (Old Name) S/o Shaik Irfan Ahmed, resident of D.No. 17-93/4, Near Sivalayam Street, Nuzividu- 521201, AP. I have changed my name as **Shaik Abdulla Aman Ahmed** (New Name), S/o Shaik Irfan Ahmed. Hereafter my name is known as **Shaik Abdulla Aman Ahmed** (New Name), S/o Shaik Irfan Ahmed.

సి.ఆర్.పి.ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: సి.అర్.పి.ల సమస్యలు పరిష్కరించాలని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి సి.ఆర్.పి. లు విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సి.ఆర్.పి.లు శుక్రవారం ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీకి విచ్చేసిన

మంత్రి కొలుసు పార్ధసారధికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, కాంప్లెక్స్ నందు పని చేసేవిధంగా,హెచ్.అర్. పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి. లు ఎం. రామారావు, ఎస్.కె. బాజీ, ఎం. సుభాషిణి,బి. సుజాత పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

విశాలాంధ్ర - గణపవరం: బిడ్డకు తల్లిపాలు పట్టించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ పిప్పర సెక్టర్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గ భవాని అన్నారు. శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు భాగంగా గణపవరం మండలం పిప్పర గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సూపర్వైజర్ దుర్గ భవాని ఆధ్వర్యంలో తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది. తల్లి పాలు బిడ్డ కు ఎంతో శ్రేయస్కారమని మొదటి గంటలోపు పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పిల్లలుకు వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి వెంకటేశ్వర్లు, పిప్పర మహిళా పోలీస్ పుష్ప ఏఎన్ఎం ఎం పి హెచ్ డబ్ల్యు అంగన్వాడీ కార్యకర్తలు,గర్భిణీ లు, బాలింతలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనులు పరిశీలన

విశాలాంధ్ర-తణుకు : ప్రతి పేదవారికి పట్టెడన్నం పెట్టాలి అనే కీ.శే.నందమూరి తారకరామారావు ఆశయాలకు అనుగుణంగా గత తెదేపా పాలనలో ప్రారంభించిన అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకు భోజనం అందించారు. దురదృష్టవశాత్తు 2019 లో వచ్చిన జగన్ మోహన్ రెడ్డి కక్షపూరిత ఆలోచనలతో అర్ధాంతరంగా అన్న క్యాంటిన్ లను మూసి వేసారని అయినప్పటికీ

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆదేశాల మేరకు అన్నా క్యాంటీన్ (మొబైల్ క్యాంటీన్)ను ఏర్పాటు చేసి నియోజకవర్గంలో పేదవాడి ఆకలి తీర్చామన్నారు.తిరిగి మళ్ళీ ప్రతి పేదవాడికి 5 రూపాయలకే భోజనం అందించాలనే ఒక ఆశయంతో ఆగష్టు 15 నుండి రాష్ట్ర వ్యాప్తంగా 183 అన్న క్యాంటిన్ లను ప్రారంభించడం జరుగుతుందని దానిలో భాగంగా తణుకు పట్టణంలోని మరలా అన్న క్యాంటిన్ ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. తెదేపా, జనసేన, బిజెపి పార్టీలు ఎప్పుడు పేదల ప్రక్షాన నిలబడతాయని కొనియాడారు. 2019 నుండి తణుకు పట్టణంలో ఉన్నటువంటి అన్న క్యాంటిన్ భవనాన్ని వదిలేయడంతో తిరిగి నేడు సుమారు 20 లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేయవలసి వస్తుందని దీని వలణ ప్రజా ధనాన్ని గత వైసిపి పాలకులు ఎలా దుర్వినియోగం చేయాలో చెప్పడానికి ఇలాంటివి ఒక ఉదాహరణ అని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ఒకేసారి వెయ్యి రూపాయిలు పెంచి 4000 రూపాయలు అందించామన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వేడుకలు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ తీర్పు నిర్ణయం పై వారం రోజులపాటు విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ పోలవరం నియోజకవర్గ నేత సొంగ వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం కన్నాపురంలోని బాబు

జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వ హించిన వేడుక కార్యక్రమానికి అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జస్టిస్ చంద్ర చూడ్ నేతృత్వన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మందా కృష్ణ మాదిగ నేతృత్వాన మూడు దశాబ్దాల పోరాటానికి ముగింపు పలికింది అన్నారు. ఇది అణగారిన వర్గాల వారికి శుభ సూచకమనీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. చాపల చినబాబు, కొడవటి సూర్యచంద్రం, యడ్లపల్లి అబ్బులు, ముప్పిడి కనిష్ట, సొంగ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

విశాలాంధ్ర-టి నరసాపురం: పుట్టిన బిడ్డకు తల్లి పాలు శ్రేష్టమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎం. లక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని కేతవరం అంగన్వాడీకేంద్రం -1 లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన

వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలల్లో విటమిన్ ఎ డి మరియు ఐరన్ అధికంగా ఉంటుందన్నారు. బిడ్డకు 6 నెలలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని చెప్పారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు దారి తీస్తాయన్నారు. బేటి బచావో బేటీ పడావ్, బాలికల విద్య, లింగ వివక్ష వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి. శివమాధవి, సామాజిక ఆరోగ్య అధికారి సి హెచ్ కె రాజు, అంగన్వాడీ కార్యకర్తలు అగ్నిపర్తి శ్యామల,సాదిమళ్ళ సువర్ణ మాత, ఎఎన్ఎం వై. ఏసుమరియ,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

Vendra Yamini, W/o Pasupuleti Bulli Raju, Female, R/o Door No.10-13-7, Near Womens College, Market Road, Tanuku Mandal, W.G.Dist, A.P., My name has been changed from **Pasupuleti Yamini, W/o Pasupuleti Bulli Raju** to **Vendra Yamini, W/o Pasupuleti Bulli Raju.** Now onwards my name has been calling as **Vendra Yamini, W/o Pasupuleti Bulli Raju** so please consider my New name.

తల్లిపాలు బిడ్డలకు ఇవ్వాలి

విశాలాంధ్ర-లింగపాలెం: తల్లిపాలు బిడ్డకు మంచివని బిడ్డలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ప్రీతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బోగోలు అంగన్‌వాడి సెంటర్లో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి తల్లి తమ బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలని తెలిపారు. చిన్నతనంలో పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉండాలని, దీనివల్ల భవిష్యత్తులో వ్యాధుల బారిన పడరని అన్నారు. తల్లి, బిడ్డలు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మజ, అంగన్వాడీ కార్యకర్త విమల, ఆరోగ్య సిబ్బంది,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర-లింగపాలెం: భార్యాభర్తల మధ్య ఉన్న వివాదాల వల్ల కొత్తపల్లికి చెందిన ఎం. మౌనిక(28) ఆత్మహత్య చేసుకుంది. పురుగు మందు తాగిన ఈమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. చికిత్స చేస్తుండగా మృతి చెందింది. ఈమెకు బోరంపాలెంలోని సంసోనుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య వివాదాలు ఉండటంతో తన ఆరేళ్ల కుమార్తెతో పుట్టిల్లు కొత్తపల్లిలో అమ్మ, నాన్నల వద్ద ఉంటున్నది. భర్తతో ఉన్న ఎడబాటును భరించలేని ఈమె ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏలూరు కాలువ నీటిమట్టం తగ్గించండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: రూరల్ మండలం నవాబుపాలెం, కొత్తూరు, ఆరుగొలను గ్రామాల ఆయకట్టు వర్షపు నీటితో నేటికీ ముంపులో ఉందని ఏలూరు కాలువ నీటిమట్టం తగ్గించాలని ఇరిగేషన్ ఎస్ఈని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం నవాబుపాలెం సర్పంచ్ మద్దుకూరి ధనరాజు, కృష్ణయ్యపాలెం సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాదులతో కలిసి రైతులు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల అవతల గట్టున రైల్వే ట్రాక్, ఇవతల ఏలూరు కెనాల్ నీటిమట్టం ఎక్కువగా ఉండటం వల్ల వర్షపు నీరు చేలలోంచి బయటకు వెళ్లడం లేదన్నారు. దీనివల్ల 20 రోజులుగా పంట నీటిమనక లోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెంటనే ఏలూరు కాలువ నీటిమట్టం తగ్గించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎప్పుడు వర్షాలు కురిసినా ఇదే పరిస్థితి పునరావృతం అవుతోందని, దీనిపై శాశ్వత చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు వేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

గర్భిణీలు పోషకాహారాన్ని తీసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : గర్భం దాల్చిన మూడు నెలల నుంచి 9 నెలల వరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పోషక ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ సుబ్బలక్ష్మి అన్నారు.

శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీలకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ విధంగా పౌష్టికాహారం అందించడం శుభ పరిణామమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాతల సహకారంతో 84 మంది గర్భిణీలకు రొట్టెలు, కోడిగుడ్లు, ఆకుకూరలు, పండ్లు సంపూర్ణంగా అందించామని, ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కళ్యాణ్ కుమార్, ఆసుపత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే ధ్యేయం

విశాలాంధ్ర- భీమవరం టౌన్: భీమవరం డివిజన్లో గంజాయి, మత్తు పదార్థాలు లేకుండా నిర్మూలన చేస్తానని భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డిఅన్నారు. శుక్రవారం భీమవరం డివిజన్ పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నా ఆయన, విలేకరులతో మాట్లాడుతూ

గతంలో ఇదే భీమవరంలో తాను పనిచేశానని అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పింగళి వెంకయ్య జయంతి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య148 జయంతి శుక్రవారం నిర్వహించారు. కుంతల గూడెం ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు



వెంకయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. స్వాతంత్రోద్యమ సమయంలో వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం ప్రధాన భూమిక పోషించిందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య జీవిత విశేషాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర- పెదపాడు : పెదపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు పి. వెంకటేశ్వరరావు అధ్యక్ష తన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పారా మెడికల్ ఆప్తలమిక్ ఆఫీసర్ కె. సురేంద్రబాబు మాట్లాడుతూ నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్

ఆఫ్ బ్లైండెడ్ నెస్ పర్యవేక్షణలో జిల్లా బ్లైండెడ్ నెస్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నాలుగు నెలలపాటు ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చూపు మసక ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను అందిస్తామన్నారు. సర్జరీ అవసరమైన విద్యార్థులను ఏలూరులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు .కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూలు లో మూడు రోజులు పాటు ఐ క్యాంప్ నిర్వహిస్తామన్నారు .పెదపాడు పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్ చక్రధర్ ఆధ్వర్యంలో పెదపాడు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ బి. నాగలక్ష్మి ,హెల్త్ సూపర్వైజర్ ఎ. శ్రీనివాసరావు, ఏఎన్ఎం రత్నకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.